క్లుప్తంగా

శాస్త్రోక్తంగా చండీయాగానికి శ్రీకారం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో కామాక్షి అమ్మవారి చండీయాగానికి ఆదివారం శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. కార్తీకమాసం సందర్భంగా ఆలయంలో విశేష పూజ, హోమ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తొమ్మిది రోజుల పాటు చండీయాగం జరిపించనున్నారు. ఈమేరకు యాగశాలలో ఉదయం పూజ, నిత్య హోమం, చండీహోమం, లఘు పూర్ణాహుతి, నివేదన, హారతి సమర్పించారు. సాయంత్రం హోమం, చండీ పారాయణం, సహస్రనామార్చన, విశేష దీపారాధన చేపట్టారు. గృహస్తులు ఇద్దరు రూ.500 చెల్లించి ఒక రోజు హోమంలో పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అధ్యయన తరగతులు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న అతిథులు

పాకాల : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం భారత రాజ్యాంగంపై అధ్యయన తరగతులు నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం, విధులు, బాధ్యతలు, హక్కులు, అమలు తీరు వంటి అంశాలను వివరించారు. రాజ్యాంగం స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం కోరుకుంటుందని వెల్లడించారు. అనంతరం యుద్ధభూమి పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి తాళ్ల రవీంద్రబాబు, ఎంఈఓ బాబ్జీ, ప్రభు, ఆదికేశవులు, జ్యోతి, వెంకటరత్నం, గోపాలయ్య, జనార్దన్, ఉదయ్ పాల్గొన్నారు.

భానుప్రకాష్‌రెడ్డికి సత్కారం



భానుప్రకాష్‌రెడ్డిని సన్మానిస్తున్న నేతలు

తిరుపతి(అలిపిరి): టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమితులైన బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డిని ఆదివారం మహతి ఆడిటోరియంలో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, బీజేపీ నేతలు కోలా ఆనంద్, చంద్రప్పతోపాటు స్థానిక నాయకులు గవ్వల అశోక్, కిరణ్, నరసింహ, శ్రీను, వెంకట్ రమణ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతికం



కళాకారుల నృత్య ప్రదర్శన

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తిరుపతికి చెందిన శివగౌరి నృత్యాలయ, నాట్య గురువు ఉమశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్యం విశేషంగా ఆకట్టుకుంది. నాగేంద్ర హారాయ, సౌభాగ్య లక్ష్మీ, వక్రతుండ మహాకాయ, మహాగణపతిం, చిన్నశిశువూ, ముద్దుగారే యశోద, బ్రహ్మమొక్కటే, శ్రీమన్నారాయణ, మూషిక వాహన వంటి పాటలు, కీర్తనలకు కళాకారులు భావిష, ఆశ్రిత, కీర్తన, ధామిని, షన్విక, హనన్య, శ్రీనిధి, సహస్ర, ఇసై ప్రియ, రోషిణి, పూజశ్రీ, సేహిత, మేఘన ప్రియ, జోషిక, రిచిత, తనిష్క్ చేపట్టిన ప్రదర్శన అబ్బురపరిచింది. కళాకారులకు ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు. అనంతరం పాకాలకు చెందిన కృష్ణా బృందం ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. కళాకారులను ఏఓ ఖాదర్‌వలీ సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.



ప్రశ్నించేనా..?


ప్రజావాణి వినిపించేనా..?

- అసెంబ్లీ గత సమావేశాల్లో నోరుమెదపని తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు
- గళమెత్తాలంటున్న నియోజకవర్గ ప్రజలు
- నేటి నుంచి శాసనసభ సమావేశాలు

సార్వత్రిక ఎన్నికల సమయంలో అధినేతలకు మించి హామీలు గుప్పించారు. తిరుపతిని ప్రగతి పథంలో నడిపిస్తామని.. చంద్రగిరివాసుల బతుకులు మారుస్తామని ఊదరగొట్టారు. ప్రజలను మాటలతో మభ్య పెట్టి ఓట్లు వేయించుకున్నారు. అధికారంలోకి వచ్చాక అన్నీ మరచిపోయి వ్యవహరిస్తున్నారు. సత్కారాలు.. సొంత పనులకే పరిమితమయ్యారు. అసెంబ్లీ తొలి సమావేశంలో నియోజకవర్గ సమస్యలు ప్రస్తావించకుండా మూగనోము పట్టారు. ఏదో చేసేస్తారనుకున్న అందరి ఆశలపై నీళ్లు చల్లేశారు. కనీసం సోమవారం నుంచి మొదలవుతున్న శాసనసభను అయినా ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని సద్వినియోగం చేసుకోవాలని జనం కోరుతున్నారు. గళమెత్తి పథకాల అమలుపై ప్రశ్నించాలని స్పష్టం చేస్తున్నారు.



ఎమ్మెల్యే ఆరణి



ఎమ్మెల్యే నాని

తిరుపతి సిటీ/ తుడా : తిరుపతి నగరంలో పాత కొత్త డ్రైనేజ్ వ్యవస్థ నిర్మాణంపై చర్చించి అనుమతులు పొందాలి. తాగునీటి సమస్య నివారణకు కండలేరు పైప్‌లైన్ కోసం నిధులు రాబట్టాలి. అలిపిరి సమీపంలో నేషనల్ సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు కృషి చేయాలి. నియోజకవర్గంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకురావాలి. రహదారుల దయనీయ పరిస్థితిని శాసన సభ దృష్టికి తీసుకెళ్లాలి. అలాగే తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఆగిపోయిన పేదల ఇంటి నిర్మాణంపై చర్యలు చేపట్టాలి. వర్షాలకు గుంతలమయమైన సీసీ రోడ్ల మరమ్మతులను ప్రస్తావించాలి. కొత్తగా పింఛన్లు, రేషన్ కార్డులు, పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన, తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ నిధులు, రైతుభరోసా, సబ్సిడీపై విత్తన, ఎరువుల పంపిణీపై ఎమ్మెల్యేలు పులివర్తినాని, ఆరణి శ్రీనివాసులు శాసనసభ సమావేశాలలో చర్చించేందుకు ప్రయత్నించాలి.

సరైన వేదిక అసెంబ్లీనే



తిరుపతి నగరంలో 50 ఏళ్లనాటి డ్రైనేజ్ సిస్టమ్ ప్రస్తుతం క్షీణదశకు చేరుకుంది. చిరుజల్లులు పడితే చాలు మురుగు కాలువలు పొంగి పొర్లుతున్నాయి. ప్రధాన రహదారులు మురుగుతో నిండిపోతున్నాయి. అయినప్పటికీ ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. తాగునీటి సమస్య పరిష్కారానికి గళం విప్పాలి. ఎమ్మెల్యేలు గత సమావేశాల్లో తిరుపతి నగర ప్రస్తావన కూడా తీసుకురాకపోవడం దారుణం. టీటీడీనిధులు నగరాభివృద్ధికి ఖర్చు పెట్టేందుకు అనుమతులపై శాసనసభ వేదికగా చర్చించాలి.- కృష్ణమూర్తి, రిటైర్డ్ ఉద్యోగి, తిరుపతి

హామీలపై చర్చించాలి



ఎన్నికల సమయంలో కూటమి ప్రజాప్రతినిధులు ప్రజలకు ఇచ్చిన హామీల విషయంపై శాసనసభలో చర్చించాలి. విద్యాసంస్థలు ప్రారంభమై 6నెలలు కావస్తున్నా తల్లికి వందనం ఊసేలేదు. విద్యుత్ చార్జీలు పెంచమని మాట ఇచ్చిన కూటమి నేతలు భారీ స్థాయిలో పెంచి పేదల నడ్డి విరుస్తున్నారు. అక్టోబర్‌లో కురిసిన వర్షానికి తిరుపతి శివారు ప్రజలు నరకం అనుభవించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కనీసం కనిపించలేదు. రోడ్ల పరిస్థితి నగరంలో దారుణంగా ఉంది. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– ప్రమీలమ్మ, రిటైర్డ్ టీచర్, తిరుపతి

చక్కటి అవకాశం



చంద్రగిరి నియోజకవర్గంలోని సమస్యలపై ఎమ్మెల్యే పులివర్తి నాని గళం విప్పాలి. అసెంబ్లీ గత సమావేశాల్లో కనీసం నియోజకవర్గం మాట వినిపించకపోవడం బాధాకరం. అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఇదే చక్కటి అవకాశం. దీన్ని సద్వినియోగం చేసుకుని చంద్రగిరిని ప్రగతిపథంలో నడిపించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మనసులో పెట్టుకుని వాటిని నెరవేర్చేందుకు ముందుకు సాగాలి. అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించి నిధులు రాబట్టాలి. అప్పుడు ఇంతటి మెజారిటీతో గెలిచినందుకు సార్థకత ఉంటుంది.

– టి.రామచంద్ర, చంద్రగిరి

గళం వినిపించాలి



ప్రజా సమస్యలపై సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించిన వారిపై కేసులు, అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురిచేయడం మానాలి. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం వివనిపించాలి. గత సమావేశాల్లో చంద్రగిరి ప్రజల వాణి వినపడలేదు. కనీసం ఈ సమావేశాల్లో అయినా సమస్యలను ప్రస్తావించాలి. అభివృద్ధికి నిధులు కేటాయించేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలి. రైతుల కష్టాలు, రోడ్లు, రెవెన్యూ, విద్య, వైద్య సమస్యలపై ఎమ్మెల్యే మాట్లాడాలి. అలాగే నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై క్లారిటీ తీసుకురావాలి.

– శ్రీనివాసులు, తిరుపతి రూరల్

‘నా అడుగు ఎప్పుడూ ముందుకే’ ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : విద్యావేత్త, డాక్టర్ వీఎస్ రమేష్ బాబు తన ఆత్మకథగా రచించిన నా అడుగు ఎప్పుడూ ముందుకే పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. రాస్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, శ్వేత పూర్వ సంచాలకుడు భూమన్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రమేష్‌బాబు ఆత్మకథ గెలుపు ఓటములు సహజమని, ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని చెబుతుందన్నారు. జీవితంలో ఒక ద్వారం మూసుకున్నా మరో ద్వారం తెరిచే ఉంటుంది అనేది ఈ పుస్తకం సారాంశమని తెలిపారు. ఎస్వీయూ ఆచార్యుడు పీసీ వెంకటేశ్వర్లు పుస్తక సమీక్ష చేశారు. అనంతరం రమేష్‌బాబును ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కిరణ్‌క్రాంత్ చౌదరి, ఏవీఎస్ స్వామి, కోట పురుషోత్తం, స్వరాజ్యలక్ష్మి, చంద్రయ్య, డి.మస్తానమ్మ, శేషయ్య, దేవసేన నాయుడు, దామోదర నాయుడు, నాగరాజ నాయుడు, మంజునాథ్, సాకం నాగరాజు, వాకా ప్రసాద్, పేరూరు బాలసుబ్రమణ్యం, ఏనుగు అంకమ నాయుడు, వేమూరి జయరాం ప్రసాద్, గోవిందరాజులు, సుభద్ర, షణ్ముగం, రవిచంద్రన్, శోభ, భూపాల్ నాయుడు, శ్రీమన్నారాయణ, బాలకృష్ణ, శౌరయ్య, సురేంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన భోజనం



వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

తిరుపతి కల్చరల్ : వినాయకసాగర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వడమాలపేట మండలం ఉమామహేశ్వరాలయంలో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ హాజరై ప్రసంగించారు. ఆరోగ్య పరిరక్షణకు నడకతో తోడైన వాకర్స్ సమైక్యంగా సమాజ హితం కోసం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్తీక మాసంలో సహపంక్తి భోజనం చేసి ఆట పాటలతో గడపడం సంతోషకరమని తెలిపారు. అనంతరం 300 మంది సభ్యులతో కలిసి శివుడికి అభిషేకించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. వివిధ ఆటలు, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జ్ఞాపికలు, నూతన ఏడాది డైరీ, క్యాలెండర్లను అందజేశారు. కార్యక్రమంలో సంకల్ప హాస్పిటల్ డైరెక్టర్ బండ్ల సోమేష్, వి.జగన్నాథం, వాకర్స్ అసోసియేషన్ నేతలు బాలాజీ, శివారెడ్డి, సాయి కృష్ణంరాజు, చంద్ర, నరసింహయ్య, శాంతి, పుష్పలత, కమలమ్మ పాల్గొన్నారు.

అందుబాటులోనే 108 సేవలు

తిరుపతి అర్బన్ : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 108 వాహనాలు అందుబాటులోనే ఉన్నాయని, సక్రమంగా ప్రజలకు సేవలు అందిస్తున్నాయని ఆ విభాగం జిల్లా అధికారి జి. సంజీవరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 41 వాహనాలు అరోబిందో ఎమర్జెన్సీ సర్వీసెస్ ఆధ్వర్యంలో నడుస్తున్నాయని చెప్పారు. అయితే ఇటీవల కొన్ని వాహనాలు మరమ్మతులకు గురి కావడంతో వాటిని వినియోగించడం లేదని వెల్లడించారు. వాటి స్థానంలో 7 కొత్త వాహనాలు వచ్చాయని స్పష్టం చేశారు. సాక్షి దినపత్రికలో ఆదివారం ‘ఆపద్బాంధవికి చెదలు’ శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు.

సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీతో సీఐటీయూ నేతలు

పాకాల : స్థానిక భారతంమిట్ట సీఐటీయూ భవనంలో ఆదివారం మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా ప్రసాద్, కో–కన్వీనర్‌గా మురళి, బిల్డింగ్ వర్క్సుకు వెంకటరత్నం, పెద్దబ్బ, కార్యవర్గం సభ్యులుగా తంబి, వెంకటేష్, ధనమ్మ, గురవయ్య, స్వచ్ఛభారత్ సుగుణమ్మను శ్రామిక్ మహిళా కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు సీపీ బ్రౌన్



నివాళులర్పిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : తెలుగు భాషకు జీవం పోసిన మహనీయుల్లో సీపీ బ్రౌన్ చిరస్మరణీయులని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి కొనియాడారు. సీపీ.బ్రౌన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం రంగస్థలి కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ ఆంగ్లేయుడైన సీపీ బ్రౌన్‌ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో సబ్ కలెక్టర్‌గా పనిచేస్తూ తెలుగు భాష నేర్చుకుని, వేమన పద్యాలను ప్రచురింపజేశారని వెల్లడించారు. తెలుగు- ఇంగ్లిష్ డిక్షనరీలను అందుబాటులోకి తీసుకువచ్చారని వివరించారు. కార్యక్రమంలో కేఎస్ రాజా, కస్పా పద్మనాభన్, కేశవులురెడ్డి, లక్ష్మయ్య, రహీమ్, గురుప్రసాద్, సూర్యప్రకాష్, ఆనంద్, నాగేశ్వరాచారి పాల్గొన్నారు.

ముగిసిన ‘యువ తరంగ్’



జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

తిరుపతి సిటీ : ఎస్వీయూలో మూడు రోజులుగా యువతరంగ్ పేరుతో నిర్వహిస్తున్న యూత్ ఫెస్టివల్ ఆదివారంతో ముగిసింది. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ముఖ్యఅతిథిగా హాజరై పలు సాంస్కృతిక విభాగాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఫెస్టివల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు చెన్నైలో జరిగే సౌత్‌జోన్ యూత్ ఫెస్టివల్‌లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రొఫెసర్లు దామోదర్‌రెడ్డి, బీవీ మురళీధర్, డాక్టర్ వివేక్, డాక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.

ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర కార్యదర్శిగా పట్టాభిరామయ్య

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇటీవల రాజమండ్రిలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ(ఎస్ఎల్‌టీఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానంతరం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు లభించింది. ఈ ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పి.కాటయ్య(పులిచెర్ల), రాష్ట్ర కార్యదర్శిగా ఆర్.పట్టాభిరామయ్య (బీఎస్ కండ్రిగ)ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొడ్డ ఉమామహేశ్వర్, సిబ్బాల కిరణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



పక్కకు ఒరిగిన కారు, స్తంభం

చంద్రగిరి (తిరుచానూరు) : మంగళం డిపో వద్ద ఆదివారం విద్యుత్ స్తంభాన్ని ప్రమాదవశాత్తు ఓ కారు ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా, స్తంభం ఓ వైపునకు ఒరిగిపోయింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

‘ఉత్తమ’ ఎంపికపై విమర్శలు



ఎస్వీ ఆర్ట్స్ కళాశాల భవనం

తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఉత్తమ అధ్యాపకుల జాబితాపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా ఎస్వీయూలోని అధ్యాపకుల్లో ఇద్దరికి మాత్రమే అవార్డు దక్కడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఎస్వీయూ నుంచి ఏడుగురు ఎంపికవగా ఇప్పుడు ఆ సంఖ్య తగ్గిపోవడంపై చర్చనీయాంశమైంది. అయితే మహిళా వర్సిటీ నుంచి ముగ్గురికి పురస్కారం లభించడం కాస్త ఊరటనిచ్చే అంశం. ఎస్వీ అగ్రికల్చర్ నుంచి ఒక్కరిని ఎంపిక చేసిన ప్రభుత్వం, ఎస్వీ వెటర్నరీని పట్టించుకోకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతి డిగ్రీ కళాశాల, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలకు ప్రభుత్వం మొండి చెయ్యి చూపించింది. కనీసం ఒక్కరిని కూడా ఉత్తమ అవార్డుకు ఎంపిక చేయకపోవడంపై అధ్యాపకులు మండిపడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఉత్తమ అధ్యాపక అవార్డులను ప్రదానం చేయనున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ సునీల్ కుమార్

చంద్రగిరి(తిరుచానూరు) : సైబర్ నేరాలపై అవగాహన అవసరమని తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి దామినేడు ఇందిరమ్మ గృహాల వద్ద స్థానికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ వాట్సాప్, ఈ–మెయిల్, టెక్ట్స్ మెసేజ్‌ల ద్వారా బ్యాంకు, ఉద్యోగాలు, బంపర్ డ్రాల పేరుతో మోసపు మెసేజ్‌లను పంపుతున్నారన్నారు. వాటిని క్లిక్ చేయడం, గుర్తు తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం ద్వారా మన వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించే ప్రమాదముందని హెచ్చరించారు. అలాగే బ్యాంకు ఖాతాల వివరాలతో పాటు నగదును కూడా సైబర్ నేరగాళ్లు కాజేస్తున్నారన్నారు. అపరిచిత ఫోన్ కాల్స్, వీడియో కాల్స్‌కు స్పందించకూడదని సూచించారు. ఏమాత్రం అనుమానం వచ్చినా పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ అరుణ పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు

భాకరాపేట : బెల్ట్ షాపులు నిర్వహించినా, సారా తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని భాకరాపేట ఎస్ఐ రాఘవేంద్ర, ఎర్రావారిపాళెం ఎస్ఐ డీవై స్వామి హెచ్చరించారు. ఆదివారం వారు మాట్లాడుతూ బెల్ట్ షాపులు, సారా తయారీ, విక్రయాలపై ఎవరికైనా తెలిస్తే వెంటనే భాకరాపేట సీఐ ఇమ్రాన్ 9490617880, ఎస్ఐ 9440900711, ఎర్రావారిపాళెం ఎస్ఐ 9440900708 నంబర్‌లకు సమాచారం అందించాలని వారు కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు.

26న కలెక్టరేట్ వద్ద ధర్నా

తిరుపతి కల్చరల్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 26వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పేరుతో కార్మికులకు అనేక హామీలు ఇచ్చారన్నారు. అధికారం చేపట్టి ఐదు నెలలు కావస్తున్నా కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏ మాత్రం చొరవ చూపడం లేదని మండిపడ్డారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, కె.రాధాకృష్ణ, నేతలు ఎన్‌డీ రవి, కేవై రాజా, వైఎస్ మణి, నాగేంద్ర , బాబు, హేమావతి, అన్నాదొరై, వాణి, బుజ్జి, కార్తీక్, శ్రీనివాసులు, సుశీల, చంద్రకళ, పురుషోత్తం పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల : తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే విరూపాక్షి, మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, మంత్రి పార్థసారథి, తెలంగాణ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

నేడు పబ్లిక్ గ్రీవెన్స్

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమాన్ని ఉదయం10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ మౌర్య ఆదివారం కోరారు. వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, ఫోన్ నంబర్ పేర్కొన్నాలని సూచించారు.